మనం
హైదరాబాద్
రంగారెడ్డి । మేడ్చల్
మంగళవారం । 13 । అక్టోబర్ । 2026 పేజీలు:12

# వికసిత్ భారత్ నిర్మాణంలో ఇంజినీర్‌లదే కీలక పాత్ర





## జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఎస్కీ డైరెక్టర్ కల్నల్ హార్‌పాల్ సింగ్ గ్రేవల్

2

హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): భారతదేశాన్ని సర్వతోముఖాభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు, సాంకేతిక రంగంలో నూతన ఒరవడిని సృష్టించేందుకు యువ ఇంజినీర్లు పునరంకితం కావాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్ పిలుపునిచ్చారు.

# ఫార్ములా రైడ్

## మొబైల్ రేసింగ్ గేమ్



### గేమింగ్ రంగంలో మరో అడుగు వేస్తున్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్



2

హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): భారతీయ గేమింగ్ రంగంలో మరో నూతన అధ్యాయం మొదలుకానుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ తాజాగా త్వరలో మార్కెట్లోకి రానున్న మొబైల్ రేసింగ్ గేమ్ 'ఫార్ములా రైడ్'ను ప్రకటించింది. అద్భుతమైన వేగం, వ్యూహాత్మక నిర్ణయాలు, కెరీర్ పురోగతి, రియల్‌టైమ్ మల్టీప్లేయర్ వంటి ప్రత్యేక ఆకర్షణలతో ఈ గేమ్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు.

## ఆర్టీఐ చట్ట నిబంధనలు

# ఖచ్చితంగా పాటించాలి

: అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

3




దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందాలి

రికార్డుల డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం

హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): సమాచార హక్కు చట్టం అమలులో అధికారులందరూ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జి. జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# మెడికవర్ వైద్యుల అద్భుతం..



క్లిష్టమైన జీర్ణకోశ సమస్యలకు అధునాతన ఎండోస్కోపీతో పరిష్కారం

మెడికవర్ వైద్యులు డాక్టర్ అరుణ్ అరోరా పెగడపల్లి

4

# వికసిత్ భారత్ నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర

**జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**ఎస్కీ డైరెక్టర్ కల్నల్ హార్‌పాల్ సింగ్ గ్రేవల్**





హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): భారతదేశాన్ని సర్వతోముఖాభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు, సాంకేతిక రంగంలో నూతన ఒరవడిని సృష్టించేందుకు యువ ఇంజినీర్లు పునరంకితం కావాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్ పిలుపునిచ్చారు. దేశ విద్యుత్, మౌలిక వసతుల రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.హైదరాబాద్‌లోని ఎస్కీ ప్రాంగణంలో పవర్ అండ్ ఎనర్జీ, వాటర్ రిసోర్సెస్ డెవలప్మెంట్ డివిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 122 మంది ప్రతినిధులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కల్నల్ గ్రేవాల్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**డిజిటల్ విప్లవం..**

దేశంలో రాబోయే అయిదారు సంవత్సరాల కాలంలో దాదాపు 25 కోట్ల విద్యుత్ మీటర్లను స్మార్ట్ మీటర్లుగా మార్చే బృహత్తర అవకాశం ఉందని కల్నల్ గ్రేవాల్ స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో డిజిటల్ విప్లవానికి ఇది అత్యంత కీలకమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. దేశంలోనే తొలిసారిగా ఎస్కీలో అత్యాధునిక స్మార్ట్ మీటర్ ప్రయోగశాలను ఏర్పాటు చేశామని, ఈ సాంకేతికతపై నిపుణులకు శిక్షణనివ్వడంలో ఈ ల్యాబ్ ప్రధాన భూమిక పోషిస్తుందని కల్నల్ వెల్లడించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నామినేట్ చేసిన అభ్యర్థులు స్మార్ట్ మీటర్ల ప్రయోజనాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులకు కాంపాక్ట్ సబ్‌స్టేషన్‌లు, భూగర్భ హైటెన్షన్ కేబుల్ వ్యవస్థలు, ఆధునిక లైటింగ్ పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ వెల్లడించారు.



భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నామినేట్ చేసిన అభ్యర్థులకు ఇంజినీరింగ్ ప్రాజెక్టుల అంచనాల తయారీ, సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) రూపకల్పనపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కల్నల్ గ్రేవాల్ వివరించారు. ఆనకట్టలు, కాలువలు వంటి నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారులు, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల,డ్రైనేజీ వ్యవస్థల రూపకల్పనలో డీపీఆర్ ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు.

శిక్షణ పొందిన ఇంజినీర్లు కేవలం సాధారణ సాంకేతిక పరిజ్ఞానంతో సరిపెట్టుకోకుండా, తమ వృత్తి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కల్నల్ పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువ ఇంజినీర్ల పాత్ర అమూల్యమైనదని, జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన యువ ఇంజనీర్‌లకు సుచించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎస్కీ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఖేలో తెలంగాణ - జాగో తెలంగాణ

**ఫిట్నెస్ ఛాలెంజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**జిల్లా యువజన, క్రీడల అధికారి నంద కిశోర్ గోకుల్ పిలుపు**



హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర క్రీడల శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో తెలంగాణ' ఫిట్‌నెస్ కార్యక్రమంలో జిల్లా అధికారులు, హైదరాబాద్ వాసులు ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని జిల్లా యువజన, క్రీడల అధికారి నంద కిశోర్ గోకుల్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ కె. నారాయణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా క్రీడలు, శారీరక దారుఢ్యం యొక్క ప్రాముఖ్యతను నంద కిశోర్ గోకుల్ వివరించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి కచ్చితంగా సమయం కేటాయించాలని ఆయన సూచించారు. 'జాగో తెలంగాణ - భాగో తెలంగాణ - ఖేలో తెలంగాణ' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా,ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక, పరుగు, సాధారణ వ్యాయామం లేదా యోగా చేసేలా అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు.ఈ ఫిట్‌నెస్ ఛాలెంజ్‌ను సోషల్ మీడియా వేదికగా మరింత ముందుకు తీసుకువెళ్లేలా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ 27 సెకన్ల నిడివిగల వ్యాయామం తాలూకు వీడియోను లేదా రీల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, మరో తొమ్మిది మందిని ఈ ఛాలెంజ్‌లో పాల్గొనేలా నామినేట్ చేయాలని తెలిపారు. దీనివల్ల శారీరక దారుఢ్యంపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని సమాజంలో ప్రోత్సహించడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు.



**ఫిట్‌నెస్ ప్రాధాన్యత..**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల శాసనసభ్యులను సైతం స్వయంగా కలిసి ఆరోగ్యం, ఫిట్‌నెస్ ప్రాధాన్యతను వివరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాప్రతినిధులు స్వయంగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై ప్రజలకు ఆదర్శంగా నిలవడంతో పాటు, తమ నియోజకవర్గాల ప్రజలకు ఫిట్‌నెస్ సందేశాన్ని బలంగా చేరవేయాలని కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు. వారు కూడా మరో తొమ్మిది మందిని నామినేట్ చేయడం ద్వారా ఈ కార్యక్రమం ఒక జన ఉద్యోమలా మారుతుందని నంద కిశోర్ గోకుల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నిర్వహించనున్న క్రీడా మహోత్సవాల వివరాలను కూడా వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ను డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీల్లో దాదాపు 27 క్రీడా విభాగాల నుంచి 7,500 మందికి పైగా యువ క్రీడాకారులు పాల్గొంటారని,రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఈ అద్భుతమైన ఫిట్‌నెస్ కార్యక్రమానికి జిల్లా అధికారులు,ప్రజలందరూ తమ వంతు పూర్తి సహకారం అందించి, వ్యాయామాన్ని తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని నంద కిషోర్ స్పష్టం చేశారు.

# 'ఫార్ములా రైడ్' మొబైల్ రేసింగ్ గేమ్

**గేమింగ్ రంగంలో మరో అడుగు వేస్తున్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్**

హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): భారతీయ గేమింగ్ రంగంలో మరో నూతన అధ్యాయం మొదలుకానుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ తాజాగా త్వరలో మార్కెట్లోకి రానున్న మొబైల్ రేసింగ్ గేమ్ 'ఫార్ములా రైడ్'ను ప్రకటించింది. అద్భుతమైన వేగం, వ్యూహాత్మక నిర్ణయాలు, కెరీర్ పురోగతి, రియల్‌టైమ్ మల్టీప్లేయర్ వంటి ప్రత్యేక ఆకర్షణలతో ఈ గేమ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారుల కోసం అధికారిక విడుదలకు ముందే గూగుల్ ప్లేలో ప్రీ-రిజిస్ట్రేషన్, యాప్ స్టోర్‌లో ప్రీ-ఆర్డర్ ప్రక్రియను ప్రారంభించారు. ఫార్ములా రైడ్‌లో కేవలం వేగంగా వాహనాన్ని నడపడం మాత్రమే కాకుండా, రేసింగ్‌లో గెలుపు ఓటములను నిర్ణయించే వ్యూహాత్మక అంశాలకు పెద్దపీట వేశారు. టైర్ల నిర్వహణ, పిట్‌స్టాప్ వ్యూహాలు, వాహనానికి జరిగే నష్టాన్ని సరిదిద్దుకోవడం, బ్రేకింగ్ పనితీరుతో పాటు రేసును నియంత్రించే కీలక నిర్ణయాలు గేమ్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మారుతున్న ట్రాక్ పరిస్థితులకు తగువిధంగా స్పందిస్తూ ఆటగాళ్లు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది.




**ఆటగాళ్ళ అభిరుచికి తగినట్టు..**

ఆటగాళ్ళ అభిరుచులకు తగ్గట్టుగా ఛాంపియన్‌షిప్ మోడ్ , కెరీర్ మోడ్ , క్విక్ రేస్, క్లాసిక్ మోడ్‌లతో పాటు రియల్‌టైమ్ మల్టీప్లేయర్ వంటి అద్భుతమైన ఫీచర్లను ఇందులో పొందుపరిచారు.సొంత గేమింగ్ మేధోసంపత్తి, మొబైల్ గేమింగ్ ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంటుకు ఈ ప్రాజెక్ట్ మరింత గుర్తింపు తెస్తుందని చెప్పవచ్చు. గేమ్ రూపకల్పన నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, విజువల్ కంటెంట్ నిర్మాణం, నాణ్యతా ప్రమాణాలు, ప్రచురణ విభాగాల వరకు అన్ని బృందాలు ఈ ప్రాజెక్టు కోసం శ్రమిస్తున్నాయి. వేగవంతమైన రేసింగ్‌ను కోరుకునేవారితో పాటు, దీర్ఘకాలిక ఛాంపియన్‌షిప్‌లను ఇష్టపడే అన్ని వర్గాల ఆటగాళ్లను ఈ గేమ్ ఆకట్టుకుంటుందని నిర్వాహకులు భావిస్తున్నారు.ఈ సందర్భంగా 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.ఎం. శంకర్ మాట్లాడుతూ.. రేసింగ్ ఉత్సాహానికి మించిన సరికొత్త అనుభవాన్ని అందించేలా ఫార్ములా రైడ్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. ఆటగాళ్లు పోటీపడుతూ, అర్థవంతమైన వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటూ కాలక్రమేణా గేమ్‌లో ఎదిగే అద్భుతమైన అనుభవాన్ని సృష్టించడంపై దృష్టి సారించామని, భారత్‌లో అభివృద్ధి చేసిన సొంత గేమ్‌లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న గేమర్‌లకు అందించాలనే తమ ఆకాంక్షకు ఈ గేమ్ చక్కటి ప్రతిబింబమని శంకర్ పేర్కొన్నారు.






# ఆర్టీఐ చట్ట నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి: అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

**దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందాలి**

**రికార్డుల డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం**







హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): సమాచార హక్కు చట్టం అమలులో అధికారులందరూ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జి. జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తం ఈ నెల5 నుంచి సోమవారం వరకు నిర్వహించిన ఆర్టీఐ వారోత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పౌరులకు రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులదే కీలక పాత్ర అని అదనపు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ కార్యకలాపాలు, సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అధికారులు ఎల్లప్పుడూ చట్ట నిబంధనలకు లోబడి అత్యంత పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. పరిపాలనాపరంగా ఎదురవుతున్న సవాళ్లను ప్రస్తావిస్తూ.. పదే పదే వచ్చే సంక్లిష్టమైన దరఖాస్తులు, గత ఎన్నికల నామినేషన్లకు సంబంధించిన రికార్డుల వంటి అంశాలను వేగంగా పరిష్కరించేందుకు సమగ్ర డిజిటల్ రికార్డుల నిర్వహణ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంపై సెక్షన్ క్లర్కులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని జితేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**నెల లోపు సమాచారం :**

జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ.. 2005 అక్టోబర్ 12న అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఈ చట్టానికి ఆమోదం తెలిపారని గుర్తుచేశారు. పారదర్శకత, జవాబుదారీతనం కోసం అరుణా రాయ్ నేతృత్వంలో సాగిన ఉద్యమాలు ఈ చట్ట రూపకల్పనకు పునాది అని తెలిపారు. చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం ఫైళ్లు, ఈ-మెయిల్స్, డిజిటల్ రికార్డులు అన్నీ సమాచార పరిధిలోకి వస్తాయని వివరించారు. రూ. 10 దరఖాస్తు రుసుము, బి.పి.ఎల్ (ఆహార) కార్డుదారులకు ఉండే మినహాయింపుల గురించి తెలిపారు. సాధారణంగా 30 రోజుల్లోగా సమాచారం ఇవ్వాలని, వేరే శాఖలకు సంబంధించిన దరఖాస్తులను సెక్షన్ 6(3) ప్రకారం 5 రోజుల్లోగా బదిలీ చేయాలని సూచించారు.అలాగే సెక్షన్ 4(1) ప్రకారం వివరాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లలో అప్డేట్ చేయాలని, కార్యాలయాల్లో విడివిడిగా రిజిస్టర్లు నిర్వహించాలని నారాయణ స్పష్టం చేశారు. చట్టంలోని సెక్షన్లు 8(1), 9 కింద సమాచార వెల్లడి నుంచి ఉన్న మినహాయింపులను ఆయన అధికారులకు వివరించారు.

**రూ.25,000 వరకు జరిమానా:**

కలెక్టరేట్ ప్రజా సమాచార అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి. రవి మాట్లాడుతూ.. సమాచారం ఇవ్వడంలో జాప్యం చేస్తే చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం రాష్ట్ర సమాచార కమిషన్ రోజుకు రూ. 250 చొప్పున గరిష్ఠంగా రూ. 25,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. రికార్డుల డిజిటలైజేషన్ ద్వారా మాత్రమే సమాచారాన్ని వేగంగా అందించడం సాధ్యమవుతుందని, 2026 జనవరి 1 నుంచి ఇప్పటివరకు అందిన ఆర్టీఐ దరఖాస్తులు, వాటి పరిష్కారం, పెండింగ్ వివరాలను ప్రామాణిక నమూనాలో సమర్పించాలని అన్ని విభాగాలను రవి ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో జరిగే కలెక్టరేట్ స్థాయి సమీక్షలో దీనిపై ప్రత్యేకంగా ప్రగతిని సమీక్షిస్తామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సూపరింటెండెంట్‌లు, సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# నవరాత్రుల మూడో రోజు.. చంద్రఘంట అమ్మవారి అవతారం విశిష్టత

**నుదుటిపై అర్ధచంద్రంతో దివ్యరూపం.. ధైర్యం, శౌర్యం, శాంతికి ప్రతీకగా ఆదిశక్తి**



మేడ్చల్, అక్టోబర్ 12: ( మనం జిల్లా ప్రతినిధి): నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజుకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక విశిష్టత ఉంది. ఈ రోజున దుర్గాదేవి నవదుర్గలలో మూడో రూపమైన చంద్రఘంట అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. నుదుటిపై గంట ఆకారంలో అర్ధచంద్రుడిని ధరించి దర్శనమిచ్చే ఈ అమ్మవారు ధైర్యానికి, పరాక్రమానికి, శాంతికి ప్రతీకగా పూజలందుకుంటారు. దుష్టశక్తులను ఎదుర్కొంటూనే భక్తులకు అభయాన్ని ప్రసాదించే శక్తిస్వరూపిణిగా భక్తులు అమ్మవారిని కొలుస్తారు.

**చంద్రఘంట అనే పేరు వెనుక విశిష్టత ఏమిటి?**

చంద్ర' అంటే చంద్రుడు, ఘంట' అంటే గంట. నుదుటిపై గంట ఆకారంలో అర్ధచంద్రుడిని ధరించిన కారణంగా అమ్మవారికి చంద్రఘంట అనే పేరు వచ్చిందని పురాణ సంప్రదాయం చెబుతుంది. ఆమె దివ్యరూపం భక్తుల్లో ధైర్యాన్ని నింపుతుందని, భయాలను తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని భక్తుల విశ్వాసం.

పార్వతీదేవి శివుడిని వివాహం చేసుకున్న అనంతరం ధరించిన దివ్యరూపంగా కూడా చంద్రఘంట అమ్మవారిని కొన్ని పురాణ సంప్రదాయాలు వర్ణిస్తాయి. ఈ రూపం సౌమ్యతతో పాటు శత్రువులను ఎదుర్కొనే శక్తిని కూడా సూచిస్తుంది.

**అమ్మవారి రూపం.. ఆయుధాల విశిష్టత**

చంద్రఘంట అమ్మవారు సాధారణంగా పది చేతులతో, సింహవాహనంపై ఆసీనురాలై దర్శనమిస్తారు. ఆమె చేతుల్లో త్రిశూలం, ఖడ్గం, గద, విల్లు, బాణం వంటి ఆయుధాలతో పాటు కమలం, జపమాల వంటి వస్తువులు కనిపిస్తాయి. వివిధ చిత్రణల్లో ఆయుధాలు, చేతుల అమరికలో స్వల్ప భేదాలు ఉండవచ్చు.

సింహం ధైర్యానికి, పరాక్రమానికి ప్రతీకగా భావిస్తారు. అమ్మవారి ఆయుధాలు అన్యాయాన్ని ఎదుర్కొనే శక్తిని సూచిస్తే, ఆమె ప్రశాంతమైన ముఖం కరుణకు, మనోనిగ్రహానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. అంటే శక్తి ఉన్నంత మాత్రాన కోపంతో వ్యవహరించాల్సిన అవసరం లేదని, ధైర్యంతో పాటు వివేకం కూడా ముఖ్యమని ఈ రూపం తెలియజేస్తుంది.

**మూడో రోజు పూజల విశిష్టత**

నవరాత్రుల మూడో రోజున భక్తులు చంద్రఘంట అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పాలతో అలంకరించి, దీపారాధన చేసి, నైవేద్యాలు సమర్పిస్తూ అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకుంటారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, కుంకుమార్చనలు నిర్వహించడం కనిపిస్తుంది.

చంద్రఘంట అమ్మవారిని ఆరాధించడం వల్ల భయాలు తొలగి, ధైర్యం, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, జీవితంలోని అడ్డంకులను అధిగమించే శక్తి లభించాలని ప్రార్థిస్తారు.

**చంద్రఘంట అమ్మవారి ఆరాధనలో అంతరార్థం**

అమ్మవారి అవతారం మనిషి జీవితానికి గొప్ప సందేశాన్ని అందిస్తుంది. సమస్యలు ఎదురైనప్పుడు భయపడి వెనకడుగు వేయకుండా, ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలి. అదే సమయంలో ఆవేశానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

నేటి సమాజంలో కుటుంబ సమస్యలు, ఉద్యోగ ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సవాళ్లు మనిషిని మానసికంగా కుంగదీస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రఘంట అమ్మవారి రూపం ధైర్యాన్ని కోల్పోకూడదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని స్ఫూర్తినిస్తుంది. అన్యాయాన్ని ఎదుర్కొనే సాహసం, ఇతరుల పట్ల కరుణ, మనసులో ప్రశాంతత కలిగి ఉండటమే ఈ అవతారం అందించే ప్రధాన సందేశం.

**శక్తి, శాంతి కలగలిసిన దివ్యస్వరూపం**

చంద్రఘంట అమ్మవారి రూపంలో శౌర్యం, సౌమ్యత రెండూ సమానంగా కనిపిస్తాయి. అవసరమైనప్పుడు ధర్మాన్ని కాపాడేందుకు పోరాడే శక్తి, అదే సమయంలో భక్తుల పట్ల కరుణ చూపే తల్లితనం ఈ అవతారం ప్రత్యేకతగా నిలుస్తాయి.

నవరాత్రుల మూడో రోజున చంద్రఘంట అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ తమలో ధైర్యం, సహనం, వివేకం, దయ వంటి సద్గుణాలను పెంపొందించుకోవాలి. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబంలో ఆనందం, ఐకమత్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షిస్తారు.

# మెడికవర్ వైద్యుల అద్భుతం..

## క్లిష్టమైన జీర్ణకోశ సమస్యలకు అధునాతన ఎండోస్కోపీతో పరిష్కారం

## మెడికవర్ వైద్యులు డాక్టర్ అరుణ్ అరోరా పెగడపల్లి





హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): జీర్ణకోశ సంబంధిత అత్యంత క్లిష్టమైన వ్యాధులకు అధునాతన ఎండోస్కోపీ విధానాలతో విజయవంతంగా చికిత్స అందిస్తూ, పెద్ద శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయాలను చూపడంలో హైటెక్ సిటీలోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందం మరోసారి సత్తా చాటింది. ప్రముఖ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అరుణ్ అరోరా నేతృత్వంలో ఇద్దరు రోగులకు వినూత్న ఎండోస్కోపీ పద్ధతుల ద్వారా నూతన జీవితాన్ని ప్రసాదించారు. మొదటి ఘటనలో, 40 ఏళ్ల వ్యక్తి గత కొన్నేళ్లుగా తీవ్రమైన గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ తో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక మోతాదులో మందులు వాడినా, జీవనశైలిలో మార్పులు చేసుకున్నా గుండెల్లో మంట, ఆహారం గొంతులోకి తన్నడం, తీవ్రమైన నిద్రలేమి సమస్యలు తగ్గలేదు. దీనికి పరిష్కారంగా వైద్యులు ఆయనకు అధునాతన విధానాన్ని అమలు చేశారు. ఎలాంటి బాహ్య కోతలు లేకుండా అత్యంత నైపుణ్యంతో నిర్వహించిన ఈ ప్రక్రియ అనంతరం, ఆ రోగి అనారోగ్య లక్షణాల నుంచి పూర్తిగా విముక్తి పొందినట్టు వైద్యులు వెల్లడించారు.

ఇక రెండో కేసులో, 39 ఏళ్ల రోగి డ్యూడినమ్‌లోని జంక్షన్ వద్ద అరుదైన 'న్యూరోఎండోక్రైన్ ట్యూమర్' (కణితి)తో బాధపడుతున్నట్లు గుర్తించారు. శరీరంలో అత్యంత కీలకమైన అవయవాలకు సమీపంలో ఈ కణితి ఉండటంతో, సాధారణంగా దీనికి పెద్ద శస్త్రచికిత్స చేయాల్సి వచ్చేది. అయితే వైద్య బృందం ఎలాంటి రిస్క్ తీసుకోకుండా, ఎండోస్కోపిక్ సబ్‌మ్యూకోసల్ డిసెక్షన్ విత్ లూప్ అండ్ క్లిప్ క్లోజర్ విధానాన్ని ఎంచుకుంది. ఈ పద్ధతి ద్వారా కణితిని ఎక్కడా ముక్కలు చేయకుండా ఒకే ముక్కగా పూర్తిగా తొలగించి, ఆపై ఏర్పడిన గాయాన్ని అత్యంత సురక్షితంగా మూసివేశారు. శస్త్రచికిత్స అనంతర సమస్యలేవీ లేకుండా కోలుకున్న ఆ రోగిని కేవలం 48 గంటల్లోనే డిశ్చార్జ్ చేయడం విశేషం. ఈ సమర్థవంతమైన చికిత్స ద్వారా పెద్ద సర్జరీ తప్పడంతో పాటు, డ్యూడినమ్ ప్యాంక్రియాస్ అవయవాలు పూర్తిగా సంరక్షించబడ్డాయని మెడికవర్ వైద్యులు తెలిపారు.

### సాంకేతిక పురోగతి..

ఈ రెండు విజయాల గురించి డాక్టర్ అరుణ్ అరోరా మాట్లాడుతూ.. 'అధునాతన ఎండోస్కోపీ వైద్యరంగంలో వస్తున్న సాంకేతిక పురోగతికి ఈ కేసులే చక్కటి నిదర్శనమని,గతంలో భారీ శస్త్రచికిత్సలు అవసరమయ్యే కొన్ని జటిలమైన సమస్యలకు, సరైన రోగులను సకాలంలో ఎంపిక చేసుకుంటే ఈ అధునాతన పద్ధతులు అద్భుతమైన ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. రోగుల శరీరంలోని అవయవాలను కాపాడుతూ, కోలుకునే సమయాన్ని తగ్గించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే మా ప్రధాన ధ్యేయం' అని అరుణ్ స్పష్టం చేశారు.అత్యాధునిక ఎండోస్కోపీ సాంకేతికతను జోడించి, సంక్లిష్టమైన జీర్ణకోశ వ్యాధులకు కూడా ఎలాంటి పెద్ద కోతలు లేకుండా సురక్షితమైన వైద్యం అందించే దిశగా మెడికవర్ హాస్పిటల్స్ నిరంతరం శ్రమిస్తోందని ఈ ఘటనలు మరోసారి రుజువు చేశాయని అరుణ్ అరోరా ఉద్ఘాటించారు.

---

# మిస్టరీగా మారిన అరుణ గోదాం వ్యవహారం

## అరుణ గోదాం ను కూల్చాలంటూ కోర్టు ఆర్డర్ ఉన్న.. పట్టించుకోని అధికారులు

## సిడిఎంఏకు ఫిర్యాదు

## కూల్చి వెయ్యాలి అంటూ ఆదేశాలున్న సీజ్ చేశారని ఫిర్యాదులో ఆరోపణలు

## సీజ్ చేసిన గోదాంకు మళ్లీ అనుమతులు ఎలా వచ్చాయి అంటూ ప్రశ్న



మేడ్చల్, అక్టోబర్ 12: ( మనం జిల్లా ప్రతినిధి ): ఎల్లంపేట మున్సిపాలిటీలో అరుణ గోదాం వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతుంది. ఎల్లంపేట మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుండి ప్రారంభమైన అరుణ గోదాం ఎపిసోడ్ ఇంకా రోజురోజుకీ ఘాట్ పుట్టిస్తుంది.

గ్రామపంచాయతీ నుండి ఎల్లంపేట మున్సిపాలిటీగా పదోన్నతి పొందిన ఎల్లంపేటలో అరుణ గోదాం ఎపిసోడ్ సాగుతూనే ఉంది. కొత్తగా ఏర్పడ్డ ఎల్లంపేట మున్సిపాలిటీకి వచ్చిన కమిషనర్ దృష్టి అరుణ గోదాం పై పడింది. ఇంకేముంది దానికి నోటీసులు ఇవ్వడం సీజ్ చేయడం చకచక సాగిపోయింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా కమిషనర్ కు ఏమైందో ఏమో... అరుణ గోదాం పై మళ్లీ ప్రేమ పెరిగి ఫీజు చేసిన అరుణ గోదాం ను మళ్లీ తెరిపించారు. ఆ కమిషనర్ బదిలీ అయ్యాక మరో కమిషనర్ రాగానే ఆయన దృష్టి కూడా అరుణ గోదాం పై పడింది. ఆ కమిషనర్ కూడా వెంటనే అరుణా గోదామును సీజ్ చేయించారు. సీజ్ చేసిన వారం రోజులకే పాపం ఆ కమిషనర్ కు కూడా అరుణ గోదాం పై ప్రేమ పెరిగి మళ్లీ తెరిపించారు. ఆ కమీషనర్ వెళ్లిపోయాక మూడో కమీషనర్ గా ప్రస్తుతం కొనసాగుతున్న ఈ కమిషనర్ సైతం అరుణ గోదాంను చేశారు. అయితే రాజకీయ ఒత్తిడి ల తోనో లేక మరేం కారణాలో తెలియదు కానీ వారం రోజు తిరగకముందే మళ్లీ ఆ గోదాం ఓ పనులు చకచకా చేసుకుంటున్నారు.

### మిస్టరీగా మారిన అరుణ గోదాం

ఈ గోదాం ను ఎందుకు సీజ్ చేస్తున్నారో.... ఎందుకు ఓపెన్ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితిలో ఎల్లంపేట ప్రజలు ఉన్నారు. అరుణ గోదాం వ్యవహారం మాత్రం మిస్టరీగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన ఈ గోదాం విషయంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీజ్ చేయడం మళ్ళీ ఓపెన్ కావడంపై అనుమానాలు మరింత ఎక్కువయ్యాయి. అయితే మూడవసారి సీజ్ చేసి మళ్లీ ఓపెన్ చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తుతున్నాయి. పెద్ద ఎత్తున డబ్బులు ముట్టడంతోనే మళ్ళీ ఓపెన్ అయిందని ఎల్లంపేటలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

### తాజాగా మరో కొత్త ట్విస్ట్

ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఈ అరుణ గోదాం పై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కు ఓ ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదు సారాంశం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఈ అరుణ గోదాం పై అదే గ్రామానికి చెందిన లోకాయుక్తను సంప్రదించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన పోర్టు ఈ అరుణ గోదాంను కూల్చివేయాలి అంటూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను అందుకున్న మున్సిపల్ అధికారులు వెంటనే అరుణ గోదాం సీజ్ చేశారు. దీంతో చిర్రెత్తిన ఫిర్యాదుదారుడు చందర్ అరుణ గోదాంను కూల్చివేయాలని కోర్టు ఆదేశించిన అధికారులు మాత్రం కేవలం సీజ్ చేశారు అంటూ చందర్ పై అధికారులకు ఫిర్యాదు చేశారు. అరుణ గోదాం యజమానులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై అక్రమ గోదాం ను కూల్చాలని ఆదేశించిన కూల్చకుండా కేవలం సీజ్ చేశారని... సీజ్ చేసిన వారం రోజులకే మళ్లీ యధావిధిగా ఓపెన్ చేశారని చందర్ ఆరోపిస్తున్నారు. ఇందులో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని, ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని సి డి ఎం ఏ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో చందర్ డిమాండ్ చేశారు

# బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్, అక్టోబర్ 12: ( మనం జిల్లా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు మేడ్చల్ మల్కాంగిరి డిస్ట్రిక్ట్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో అసోసియేషన్ ) మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాంగిరి డిస్ట్రిక్ట్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ మాలతి, డిప్యూటి కలెక్టర్ మోక్షిత, , టిజిఓ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి , డిఆర్డిఓ సాంబశివరావు వైస్ ప్రెసిడింగ్ ఐ డి ఓ సి ప్రజా వాణి హాల్ లో టీ.జీ.ఓ. అసోసియేషన్ వారు రూపొందించిన బతుకమ్మ పోస్టర్ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా టీజీవోస్ మేడ్చల్ మల్కాజ్గిరి డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ వినోదకుమార్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక ఐక్యతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ ఒక గొప్ప ప్రతీక అని అన్నారు. రాష్ట్రస్థాయిలో నాంపల్లి టిజిఓ భవన్ లోఈ నెల 14న బతుకమ్మ పండుగ నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా జిల్లా స్థాయిలో మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ లో టిజిఓ సంఘం అధ్వర్యంలో ఈ నెల15న నిర్వహించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగినులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. టీ.జీ.ఓ. ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. మహిళా ఉద్యోగులలో సాంస్కృతిక చైతన్యం, ఐక్యత, సోదరభావం పెంపొందించడంతో పాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల జీవన విధానంలో అంతర్భాగమని, పూలతో బతుకమ్మను పేర్చి, ప్రకృతిని ఆరాధిస్తూ, సమిష్టిగా పాటలు పాడుతూ నిర్వహించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని టీ.జీ.ఓ. మహిళా విభాగం నాయకులు పేర్కొన్నారు. బతుకమ్మ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు అన్నారు. మరియు మహిళా ఉద్యోగులందరూ బతుకమ్మ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీ.జీ.ఓ. మేడ్చల్ మల్కాంగిరి డిస్ట్రిక్ట్ పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే విధంగా ఈ వేడుకలను ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో నిర్వహించాలని కోరింది.

ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీ.జీ.ఓ. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి వినోద్ కుమార్ ,జిల్లా కార్యదర్శి కురుమూర్తి , వివిధ శాఖలకు చెందిన మహిళా గెజిటెడ్ అధికారులు ఎం .అలివేలు మంగ వైస్ రెసిడెంట్, సుగుణబాయి డిఎం, రేణుక డిఈఓ, శీరీష ఈసి, ఉద్యోగినులు తదితరులు పాల్గొన్నారు.



## జవహర్ నగర్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**అక్రమ కట్టడాలను సహించేది లేదు: కాప్రా తహసీల్దార్ మతిన్.**

కాప్రా, అక్టోబర్ 12 (మనం న్యూస్): జవహర్ నగర్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు సమాచారం అందడంతో కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు, గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో సోమవారం పలు అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు.

జవహర్ నగర్ పరిధిలోని సంతోష్ నగర్, చెన్నాపూర్, రాజీవ్ గాంధీ నగర్, కేసీఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ.. జవహర్ నగర్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అమాయక పేదలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అటువంటి వారిని గుర్తించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా రెవెన్యూ శాఖ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. జవహర్ నగర్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎవరూ అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని మరోసారి హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## కాప్రా, నాచారం సర్కిళ్లకు ఒకే వేదికపై ప్రజావాణి

**ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్లు.**

కాప్రా/నాచారం, అక్టోబర్ 12 (మనం న్యూస్): కాప్రా, నాచారం సర్కిళ్లకు సంబంధించి సోమవారం కాప్రా సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి, వాటిని పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది నిబంధనల ప్రకారం సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చైనామాంజ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

**సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్**

మేడ్చల్, అక్టోబర్ 12: ( మనం జిల్లా ప్రతినిధి): చైనామాంజ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్ సూచించారు. చైనామాంజ వల్ల రోడ్డుపైన బైక్ పై వెళ్లేవారు గతంలో మెడ తెగి చనిపోయిన సందర్భాలు ఉన్నాయని గతంలో ఒక మిలిటరీ ఉద్యోగి, ఒక కానిస్టేబుల్, పాదచారులు ప్రమాదానికి గురైన సంఘటనలు చూసామని తెలిపారు.జీడిమెట్లలో బిఆర్ రాష్టానికి చెందిన మనీషనే వ్యక్తి గాయాల పాలు అయ్యారని గుర్తు చేశారు. చైనా మంజ విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని రవీందర్ ముదిరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రాజు అనిల్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## ఓయూలో 'రుద్రం' కలరి యుద్ధకళ ప్రదర్శన

**మహిళల ఆత్మరక్షణే ప్రధాన లక్ష్యం..**

**ఆకట్టుకున్న విద్యార్థుల యుద్ధకళ విన్యాసాలు..**





సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కళాశాల ఆవరణలో 'రుద్రం' పేరుతో నిర్వహించిన భారతీయ సంప్రదాయ యుద్ధకళ కలరి ప్రదర్శన ఆకట్టుకుంది. ఆరట్స్ కళాశాల మహిళా సాధికారత విభాగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆరట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ స్వాతి, ప్రొఫెసర్ మాయాదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రుద్రం కలరి వ్యవస్థాపకులు రాఘవ్ ముఖుంద్, షర్మిల రాఘవ్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో కలరి ప్రదర్శన నిర్వహించడం గొప్ప అవకాశమని అన్నారు. మహిళల్లో ఆత్మరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు భారతీయ సంప్రదాయ యుద్ధకళల గొప్పతనాన్ని చాటిచెప్పడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రుద్రం కలరి విద్యార్థులు ప్రదర్శించిన యుద్ధకళ విన్యాసాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు ఆత్మరక్షణలో నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు భారతీయ సంప్రదాయ యుద్ధకళలపై అవగాహన పెంచుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గురువు ఆనంధన్ గురుకల్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

**ఎంఎంసీ కమిషనర్ వినయ్కృష్ణారెడ్డిని కోరిన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్రెడ్డి**



కుషాయిగూడ, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్రెడ్డి కోరారు. సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన వివరించారు.

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, కాప్రా, నాచారం సర్కిళ్లలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పరమేశ్వర్రెడ్డి తెలిపారు. పలు కాలనీల్లో అంతర్గత రహదారులు దెబ్బతినడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేయాలని కమిషనర్కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు పరమేశ్వర్రెడ్డి తెలిపారు.

**డివిజన్ల వారీగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలు**

**వంపుగూడ డివిజన్:**

సాయిరాంనగర్, గోపాల్రెడ్డినగర్ ప్రాంతాల్లోని అంతర్గత వీధులతో పాటు శాలివాహన, వంపుగూడ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. మైత్రి కాలనీలోని పొడిగింపు వీధుల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు.

**కాప్రా డివిజన్:**

నిర్మల్నగర్, సిద్ధి కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలని, సాయిపురి కాలనీ, గాంధీనగర్లోని అంతర్గత వీధులకు రహదారులు వేయాలని కోరారు. వినాయక్నగర్ ఫేజ్-1, ఫేజ్-2, వెంకటాద్రి కాలనీల్లోని అంతర్గత రహదారులతో పాటు వినాయక్నగర్ ఫేజ్-2లో ఉషోదయ సూపర్ మార్కెట్ ఎదురుగా సీసీ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు.

**ఏఎస్రావు నగర్ డివిజన్:**

జీఆర్ రెడ్డినగర్లో ప్లాట్ నంబర్ 92 నుంచి హనుమాన్ ఆలయం వరకు, బకాసుర హోటల్ ఎదురుగా ప్లాట్ నంబర్ 127 నుంచి వాటర్ ట్యాంక్ సమీపంలోని మహేశ్వర్ బై లేన్ల వరకు సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. భవానీనగర్ కమ్యూనిటీ హాల్ నుంచి షటిల్ కోర్టు వరకు కూడా రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**బీరప్పగడ్డ డివిజన్:**

సీతారామ కాలనీలో ఇంటి నంబర్ 2-19-59/194 నుంచి 2-19-59/206 వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. బీరప్పగడ్డ నుంచి కలనీలయం క్లాత్ స్టోర్ లేన్ వరకు, రాఘవేంద్ర కాలనీలోని 1, 2, 3 రోడ్ నంబర్లతో పాటు హైకోర్టు కాలనీలోనూ సీసీ రోడ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. హబ్సిగూడ డివిజన్: కాకతీయనగర్, స్ట్రీట్ నంబర్ 2, జేఎస్ఎం కాలనీ ఈస్ట్ జంక్షన్ రోడ్డులో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

నియోజకవర్గంలోని కాలనీల్లో రహదారుల సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు సమర్పించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి, శ్రీహరి, టిల్లు యాదవ్, విఠల్ నాయక్, నాగరాజు, బాబురావు, నాగేషు, మల్లారెడ్డి, కిషోర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.







## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

మేడ్చల్, అక్టోబర్ 12:( మనం జిల్లా ప్రతినిధి ) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి తో కలిసి అదనపు కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్లో బతుకమ్మ ఘాట్ల వద్ద లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలి

**డిప్యూటీ కమిషనర్కు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ వినతి**



మేడ్చల్, అక్టోబర్ 12: ( మనం జిల్లా ప్రతినిధి): పూడూర్-కిష్టాపూర్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్లో బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ సందర్భంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్కు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కిష్టాపూర్లో బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, బతుకమ్మ ఘాట్లకు పెయింటింగ్ వేయించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా దసరా పండుగ రోజున జమ్మి ములక్కాత్ సెంటర్ వద్ద తగిన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు రావణాసురుడి దహన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. జమ్మి పూజ నిర్వహించే స్థలం పరిసరాలను శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్, కుమార్ పాల్గొన్నారు.

# ఢిల్లీ నిరసనలో చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ నేతల నిరసన**

**పాదయాత్రలో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ ఇన్చార్జి పామేన భీమ్ భరత్**





చేవెళ్ల, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఢిల్లీ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ పాల్గొని పార్టీ నాయకులకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా... కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ......ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమ నిరసనను వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరి సతీష్, క్రాంతి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# సనత్ నగర్లో బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

**14 నుంచి ఐదు రోజులపాటు వివిధ ప్రాంతాల్లో సంబరాలు..**

**25 మంది లబ్దిదారులకు రూ.10.55 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**



సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ నెల 14 నుంచి వివిధ డివిజన్ లలో నిర్వహించనున్న వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 14న రాంగోపాల్పేట డివిజన్ లోని మహంకాళి ఆలయం వద్ద, 15న బన్సీలాల్ పేటలోని మెట్ల బావి వద్ద, 16న పద్మారావు నగర్ పార్కు వద్ద వేడుకలు నిర్వహించనున్నారు. 17న అమీర్పేట డివిజన్ లోని బల్కంపేట ఆలయం వద్ద, బేగంపేట డివిజన్లోని పాటిగడ్డలో, మోండా డివిజన్లోని జీఆర్పీ గ్రౌండ్లో సంబరాలు జరగనున్నాయి. 18న సనత్నగర్లోని హనుమాన్ (సెవెన్ టెంపుల్స్) దేవాలయం, జెక్ కాలనీ, బతుకమ్మ చౌరస్తాలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నాయకులకు సూచించారు. మరోవైపు, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేకపోతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.



వెస్ట్ మారేడ్పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్దిదారులకు రూ.10.55 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. భోలక్ పూర్కు చెందిన రెడ్డి సోముకు రూ.3 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్ఓసీ పత్రాన్ని అందించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా వైద్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ సహాయాన్ని వినియోగించుకుని మెరుగైన చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, కుర్మ హేమలత, అత్తిలి మల్లికార్జున్ గౌడ్తో పాటు పలువురు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు ప్రాంతాల్లో రెండు గంటల విద్యుత్ కోత!

**జోడిమెట్ల ఫీడర్ విభజన పనులతో సరఫరాకు అంతరాయం**

**ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేత**

**వినియోగదారులు సహకరించాలి...ఏఈ విక్రమ్ బుక్యా**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 12: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం (అక్టోబర్ 13) రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ విక్రమ్ బుక్యా తెలిపారు.

పోచారం 33/11 కేవీ సబ్స్టేషన్ పరిధిలోని 11 కేవీ జోడిమెట్ల ఫీడర్ విభజన పనుల్లో భాగంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాలు:**

స్వర్ణగిరి కాలనీ, పీజీఎస్ కాలనీ, అరుంధతి కాలనీ, సీవీఎస్ఆర్ కళాశాల, హిమగిరి కాలనీ, జోడిమెట్ల చౌరస్తా, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రాంతం, కొర్రెముల తదితర పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.



వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఫీడర్ విభజన పనుల కారణంగా వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈ సూచించారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు...

# జంతర్ మంతర్ ధర్నా చౌక్ను తొలగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే

**నిరసనలకు ఆంక్షలు విధించడం సరికాదు..**

**ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే వేదికలను కాపాడాలి: బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్..**



సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నా చౌక్ ను తొలగించడం, నిరసనలకు ఆంక్షలు విధించడం దుర్మార్గమైన చర్య అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు, హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు ధర్నా చౌక్లు కీలకమైన వేదికలని ఆయన పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ అనేక ప్రజా ఉద్యమాలకు, సామాజిక న్యాయ పోరాటాలకు, వివిధ వర్గాల హక్కుల సాధనకు వేదికగా నిలిచిందని గుర్తుచేశారు. అలాంటి ప్రజాస్వామ్య వేదికను తొలగించడం లేదా నిరసనలకు అడ్డంకులు సృష్టించడం ప్రజల భావప్రకటన స్వేచ్ఛను, నిరసన తెలిపే హక్కును దెబ్బతీయడమేనని విమర్శించారు. ప్రభుత్వాలు ప్రజల సమస్యలను ఆలకించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని, అందుకు నిరసన వేదికలు దోహదపడతాయని లింగంగౌడ్ అన్నారు. ప్రజల గొంతుకను వినాల్సిన ప్రభుత్వాలు నిరసనలకు వేదికలు లేకుండా చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల హక్కులను పరిరక్షిస్తూ, శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



# మౌలాలి వాషింగ్ షెడ్ లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**రాయలసీమ ఎక్స్ప్రెస్ కోచ్ లో అపస్మారక స్థితిలో గుర్తింపు..**

**గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి..**

సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) మౌలాలిలోని రైల్వే వాషింగ్ షెడ్ లో నిలిపి ఉంచిన రాయలసీమ ఎక్స్ప్రెస్ రైలులో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 10న రాయలసీమ ఎక్స్ ప్రెస్ కోచ్ నంబర్ 258053 లో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని సికింద్రాబాద్ డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ ఆర్పీఎఫ్ పోలీసులకు తెలియజేశారు. సికింద్రాబాద్ ఆర్పీఎస్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ సాయి ఈశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారి కె. నారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని, అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని ఏఎంసీ వార్డుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అక్టోబర్ 11న మధ్యాహ్నం 1.01 గంటలకు మృతి చెందినట్లు విధుల్లో ఉన్న వైద్యుడు ధ్రువీకరించారు. దీంతో ఆర్పీఎస్ సికింద్రాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడిని గుర్తించిన వారు లేదా అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు సికింద్రాబాద్ ఆర్పీఎస్ పోలీసులను 8712568581, 8712568515 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

# ఏపీఎల్లో మైటీ మరాఠాస్కు హ్యాట్రిక్ విజయం




హైదరాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)లో మైటీ మరాఠాస్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. సోమవారం పీపుల్స్ ప్లాజాలో జరిగిన పోరులో చేరో ఆర్చర్స్తో 4-4తో సమమైన అనంతరం 'హిట్-ఆర్-మిస్' షూటాఫ్లో 2-1తో గెలిచింది. అమన్ సైని, బొమ్మదేవర ధీరజ్ షూటాఫ్లో సత్తాచాటగా, అమన్ ఆరు బాణాలతో 60/60 పాయింట్లు సాధించాడు. చేరో తరఫున మథియాస్ ఫుల్లర్టన్ మాత్రమే షూటాఫ్లో హిట్ సాధించాడు. తొలి సెట్లో చేరోకు ఆధిక్యం లభించగా, యశ్దీప్ భోగే, ధీరజ్, ఆసియాడ్ డబుల్ గోల్ మెడలిస్ట్ కుంకుమ్ మోహోద్, అమన్ సైని కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో మైటీ మరాఠాస్, చేరో ఆర్చర్స్ చెరో 6 పాయింట్లతో నిలిచాయి.

# తరతరాల సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనం.. బొమ్మల కొలువు!

**వెంకటాద్రి టౌన్షిప్లో వైభవంగా శ్రీ వైష్ణవ ఆచారాలు**

**పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న అపురూప సంప్రదాయం**

**భక్తి, సంస్కృతి, కుటుంబ అనుబంధాలకు ప్రతీకగా వేడుకలు**

**తమిళ సంప్రదాయాలను కాపాడుతున్న ఆళవందార్ వేణు మాధవ్ కుటుంబం**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 12: కాలాలు మారుతున్నా.. తరాలు మారుతున్నా.. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆచార సంప్రదాయాలను నేటికీ పదిలంగా కాపాడుకుంటోంది ఓ శ్రీ వైష్ణవ కుటుంబం. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని చౌదరిగూడ వెంకటాద్రి టౌన్షిప్లో నివసిస్తున్న ఆళవందార్ వేణు మాధవ్ కుటుంబం తరతరాలుగా వస్తున్న బొమ్మల కొలువు సంప్రదాయాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తోంది.

తమిళనాడు నుంచి తెలంగాణకు వలస వచ్చి స్థిరపడిన పూర్వీకుల వారసత్వాన్ని ఈ కుటుంబం నేటికీ కొనసాగిస్తోంది. సింగరేణి సంస్థలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన ఆళవందార్ వేణు మాధవ్ తమ కుటుంబ ఆచారాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందిస్తున్నారు.

**తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు**

శరన్నవరాత్రుల సందర్భంగా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున ఇంట్లో చెక్కతో తయారు చేసిన దేవతామూర్తులు, సంప్రదాయ బొమ్మలతో ప్రత్యేకంగా కొలువు ఏర్పాటు చేస్తారు. తొమ్మిది రోజులపాటు నిత్యం హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పిండి వంటలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు. మూలా నక్షత్రం రోజున సరస్వతీ పూజ, మహర్నవమి రోజున మహాలక్ష్మీ పూజ నిర్వహిస్తారు. ముత్తైదువులను పేరంటాలకు ఆహ్వానించి తాంబూలాలు అందజేస్తారు. భజనలు, భక్తిగీతాలు, కీర్తనలతో ఇంటిని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపుతారు. విజయదశమి అనంతరం సంప్రదాయబద్ధంగా బొమ్మల కొలువుకు ఉద్వాసన పలుకుతారు.



**ఆడబిడ్డకు ఆచారమే అపురూప కానుక!**

ఈ సంప్రదాయంలో మరో విశిష్టత ఉంది. వివాహమై అత్తవారింటికి వెళ్లే కుమార్తెకు తల్లిదండ్రులు చెక్క దేవతా బొమ్మలను కానుకగా అందజేస్తారు. పుట్టింటి ఆచారాలను మెట్టినింటా కొనసాగించాలని సూచిస్తారు. తద్వారా తరతరాలుగా భక్తి, కుటుంబ విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నారు.

**భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక**

తమిళ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే తెలంగాణ సమాజంతో మమేకమై జీవిస్తున్న ఆళవందార్ వేణు మాధవ్ కుటుంబం సాంస్కృతిక సమన్వయానికి ఆదర్శంగా నిలుస్తోంది. శ్రీ వైష్ణవ ఆచారాలు కేవలం పూజలకే పరిమితం కాకుండా కుటుంబ ఐక్యత, పెద్దల పట్ల గౌరవం, అతిథి సత్కారం వంటి విలువలను చాటుతున్నాయి. పూర్వీకుల నుంచి సంక్రమించిన సంప్రదాయాలను భావితరాలకు అందించడమే తమ లక్ష్యమని ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు..

# నీట్ పీజీ-2026లో కట్కూరి భావనారెడ్డి సత్తా..

**ఆల్ ఇండియా స్థాయిలో 1542వ ర్యాంకు..**

**రాష్ట్రస్థాయిలో 52వ స్థానం**

**560 మార్కులతో ప్రతిభ..**

**డెర్మటాలజీలో పీజీ సీటు సాధించడమే లక్ష్యం**





కుషాయిగూడ, అక్టోబర్ 12 (మనం న్యూస్): జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పీజీ-2026 ప్రవేశ పరీక్షలో చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం రెడ్డి కాలనీకి చెందిన డాక్టర్ కట్కూరి భావనారెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో 560 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 1542వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 52వ ర్యాంకు దక్కించుకున్నారు. ఆమె సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. చక్రిపురం ప్రాంతానికి చెందిన శ్రీరామ్ బేకర్స్ అండ్ స్వీట్స్ యజమాని కట్కూరి విజయకుమార్ రెడ్డి, సుధ దంపతుల కుమార్తె భావనారెడ్డి వైద్య విద్యలో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. తనకు ఎంతో ఇష్టమైన డెర్మటాలజీ (చర్మవ్యాధుల వైద్యం) విభాగంలో పీజీ సీటు సాధించాలనే లక్ష్యంతో క్రమశిక్షణతో చదువుతూ పరీక్షకు సన్నద్ధమయ్యారు. పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు గత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడంతో పాటు మాక్ టెస్టులు రాస్తూ నిరంతరం సాధన చేశారు. ఈ క్రమబద్ధమైన ప్రణాళిక, పట్టుదలతో 560 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో మంచి ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భావనారెడ్డి మాట్లాడుతూ, తనకు ఇష్టమైన డెర్మటాలజీ విభాగంలో పీజీ సీటు సాధించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. లక్ష్య సాధనలో భాగంగా పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేసి, మాక్ టెస్టుల ద్వారా పరీక్షకు సిద్ధమైనట్లు వివరించారు. నిరంతర సాధన, క్రమశిక్షణతో చదవడం తన విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. తమ కుమార్తె జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు విజయకుమార్ రెడ్డి, సుధ ఆనందం వ్యక్తం చేశారు. భావనారెడ్డి భవిష్యత్తులో వైద్యరంగంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు.

# విద్యార్థినులకు న్యాయం చేయాలి

**బిమోల్ అంగోమ్జాను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి**

**చేవెళ్లలో బీజేపీ మహిళా మోర్చా నిరసన.. దిష్టిబొమ్మల దహనం**

చేవెళ్ల, అక్టోబరు 12(మనం న్యూస్): జేఎన్యూ మాజీ ప్రొఫెసర్, కాంగ్రెస్ ఎంపీ బిమోల్ అంగోమ్జాపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధిత విద్యార్థినులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మహిళా మోర్చా పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల మున్సిపాలిటీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిమోల్ అంగోమ్జా దిష్టిబొమ్మలను దహనం చేశారు. బిమోల్ అంగోమ్జా లోక్సభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని, ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మణిపూర్కు చెందిన బిమోల్ అంగోమ్జాపై 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై జేఎన్యూ అంతర్గత విచారణ అనంతరం అక్టోబరు 9న ఆయనను ప్రొఫెసర్ ఉద్యోగం నుంచి తొలగించిందని, అక్టోబరు 12న ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. ఆరోపణలపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం మాట్లాడుతూ......మహిళలపై వేధింపుల ఆరోపణలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వరాదని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి స్వర్ణలత రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పడమటి మమత రెడ్డి మాట్లాడుతూ.....విద్యాసంస్థల్లో విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించడం యాజమాన్యాలు, ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థినులపై వేధింపుల ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, నిష్పక్షపాత విచారణ ద్వారా వాస్తవాలను వెలికితీసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని విడనాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం యాదవ్,మల్లారి డాక్టర్ వైభవ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్, కుంచం శ్రీనివాస్, శర్వలింగం, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉమా, కౌన్సిలర్ మనీషా రెడ్డి, మీనాక్షి సత్యనారాయణ, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పత్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పీసరి శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



# బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయకున్నా..
# ఫీజుల వసూళ్లలో మాత్రం ఓయూ 'స్పీడ్'!

**యంత్రాలు మూగబోయినా.. ఫీజుల వసూళ్లు ఆగలేదు!..**

**రూ.38.40 కోట్ల వసూళ్లపై ప్రశ్నించిన సీజేఎస్.. మూడు లక్షల ఇరవై వేల మంది విద్యార్థులకు ఊరట..**

**బి.బి.ఏ, బీఎస్సీ, బీఎస్డబ్ల్యూ (వీ) సెమిస్టర్ నోటిఫికేషన్ లో బయోమెట్రిక్ ఫీజు తొలగింపు..**

సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) విద్యార్థుల హాజరును పర్యవేక్షించాల్సిన బయోమెట్రిక్ యంత్రాలు ప్రైవేట్ కళాశాలల్లో సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది పక్కనపెడితే.. వాటి పేరుతో ఫీజులు వసూలు చేయడంలో మాత్రం ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) వెనుకడుగు వేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2020 నుంచి 2026 వరకు బయోమెట్రిక్ ఫీజుల రూపంలో సుమారు రూ.38.40 కోట్లు వసూలైనట్లు క్రైస్తవ జన సమితి (సీజేఎస్) పేర్కొంది. అయితే, తాజాగా విడుదలైన సెమిస్టర్ నోటిఫికేషన్లో బయోమెట్రిక్ ఫీజును తొలగించడంతో విద్యార్థులకు ఊరట లభించింది.


OSMANIA U...
HYDERABAD
(Reaccredited by NAAC with A+ Grade)

No. 187/UG/CBCS /Sem- V (Reg)/Exams/2026 Date:

To
The Principal

Sub:- UG B.A./ B.Com.(All streams)/B.Sc./B.Sc (Hon's)/B.B.A ( All Stre... B.S.W (CBCS) Semester – V (Regular) Examinations November, ...

Sir/ Madam,

The details of Examination Fee payable for B.A./B.Com.(All Streams)/B... B.B.A (All Streams)/ & B.S.W(CBCS) Semester- V (Regular) Examinations No... follows;

I. For Semester - V (Regular) Candidates :

1. B.A. & B.S.W : a. All papers — ₹1640/- + 150/- For Memo
2. B.Com & B.Sc: a. All papers — ₹1790/- + 150/- For Memo
3. B.B.A: a. All papers — ₹2040/- + 150/- For Memo

Kindly, collect the examination fee from the candidates for the above Sem... in the notification.

CONTROLLER OF E...

ఓయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, ఇంజినీరింగ్, బీఎడ్, హోటల్ మేనేజ్మెంట్ కళాశాలలు కలిపి మొత్తం 720 ఉన్నాయి. వాటిలో సుమారు 3.20 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2020 నుంచి ప్రతి సెమిస్టర్ కు ఒక్కో విద్యార్థి నుంచి రూ.100 చొప్పున, ఏడాదికి రెండు సెమిస్టర్లకు రూ.200 వసూలు చేశారు ఈ లెక్కన ఆరేళ్లలో సుమారు రూ.38.40 కోట్ల మేర ఫీజులను ఓయూ బలవంతంగా విద్యార్థుల నుంచి వసూలు చేసినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**యంత్రాలు పనిచేయకున్నా.. పర్యవేక్షణ లేకున్నా ఫీజులెందుకు?..**

విద్యార్థుల హాజరు నమోదు, పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ వ్యవస్థ ప్రైవేట్ కళాశాలల్లో సక్రమంగా పనిచేయడం లేదని, వాటిపై యూనివర్సిటీ అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడిందని సీజేఎస్ ఆరోపించింది. సేవలు సరిగా అందుబాటులో లేనప్పుడు విద్యార్థుల నుంచి ఏ ప్రాతిపదికన ఫీజులు వసూలు చేస్తున్నారనే ప్రశ్నను లేవనెత్తింది. యంత్రాల పనితీరుపై పర్యవేక్షణ లేకపోయినా, ఫీజుల వసూళ్ల విషయంలో మాత్రం నిబంధనలు గుర్తుకురావడం ఏమిటన్న విమర్శలు వ్యక్తం చేసింది. ఈ అంశంపై గత నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు సీజేఎస్ లేఖ రాసింది.



**ప్రశ్నిస్తే ఫీజు మాయం.. విద్యార్థుల సొమ్ముకు లెక్కేదీ?..**

సీజేఎస్ లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో అక్టోబర్ 11, 2026న విడుదల చేసిన బీబీఏ, బీఎస్సీ, బీఎస్డబ్ల్యూ (వీ) సెమిస్టర్ నోటిఫికేషన్లో బయోమెట్రిక్ ఫీజు అంశాన్ని తొలగించారు. దీంతో తమ పోరాట ఫలితంగా మూడు లక్షల ఇరవై వేల మంది విద్యార్థులకు ఊరట లభించిందని సీజేఎస్ ప్రకటించింది. ఇకపై విద్యార్థులు బయోమెట్రిక్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే, ఇన్నేళ్లుగా వసూలు చేసిన కోట్లాది రూపాయల ఫీజుల వినియోగం, బయోమెట్రిక్ వ్యవస్థ పనితీరు, పర్యవేక్షణపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులపై ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫీజు తొలగింపుతో సమస్య ముగిసినట్లేనా? గతంలో వసూలైన మొత్తానికి జవాబుదారీతనం ఎవరిది? విద్యార్థుల సొమ్ము ఎక్కడ, ఎలా ఖర్చయిందనే వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నలు విద్యార్థి వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

**సీఎం రేవంత్ రెడ్డికి, ఓయూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన సీజేఎస్..**

ఈ సందర్భంగా సీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మాసారం ప్రేమ్ కుమార్ విద్యార్థులకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి, ఓయూ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కుషాయిగూడ డివిజన్లో రూ.3.94 కోట్లతో అభివృద్ధి పనులు

**పలు కాలనీల్లో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట**









కుషాయిగూడ, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ డివిజన్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రూ.3 కోట్ల 94 లక్షల ప్రతిపాదిత నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా వివిధ కాలనీల్లో చేపట్టనున్న పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఆర్సీసీ పైప్లైన్ల నిర్మాణం, మురుగునీటి పారుదల వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

**కాలనీల వారీగా ప్రతిపాదిత నిధుల వివరాలు:**

1. వైష్ణవి ఎన్క్లేవ్ - రూ.36 లక్షలు
2. ఆదర్శ్ నగర్ - రూ.20 లక్షలు
3. చక్రిపురం - రూ.22 లక్షలు
4. లక్ష్మీనరసింహ కాలనీ - రూ.26 లక్షలు
5. కుషాయిగూడ గ్రామం - రూ.30 లక్షలు
6. భారత్ నగర్ - రూ.29.70 లక్షలు
7. ధోబీఘాట్ - రూ.19.80 లక్షలు
8. హనుమాన్ నగర్ - రూ.17 లక్షలు
9. శివ సాయి నగర్ - రూ.42 లక్షలు
10. మారుతి నగర్ - రూ.25 లక్షలు
11. నాగార్జున నగర్ - రూ.35 లక్షలు
12. సోనియా గాంధీ నగర్లో ఆర్సీసీ పైప్లైన్ పనులు - రూ.25 లక్షలు
13. శ్రీనివాస్ ఎన్క్లేవ్ - రూ.40 లక్షలు
14. ఇందిరా నగర్లో యూజీడీ పనులు - రూ.27.50 లక్షలు

ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మురుగునీటి పారుదల సమస్యలకు పరిష్కారం లభించనుంది. ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అలియాబాద్ తై బజార్ వేలం..

**రూ.3.41 లక్షలకు దక్కించుకున్న తుమ్మ రాకేష్**

శామీర్ పేట్, అక్టోబర్ 12 ( మనం ): అలియాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తై బజార్ వేలంపాటలో తుమ్మ రాకేష్ రూ.3,41,000లకు వేలాన్ని దక్కించుకున్నారు. ఈ వేలం 2027 మార్చి 31వ తేదీ వరకు అమల్లో ఉండనుంది.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రెడ్డి మాట్లాడుతూ, వేలంపాటలో హక్కులు దక్కించుకున్న తుమ్మ రాకేష్ మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా తై బజార్ వసూళ్లు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించకుండా పారదర్శకంగా వసూళ్లు నిర్వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, సామల జశ్వంత్రెడ్డి, ముద్దం సుధాకర్రెడ్డి, గుర్క కుమార్తో పాటు పలువురు నాయకులు, పట్టణ ప్రజలు, వేలంపాటదారులు పాల్గొన్నారు.

# జపాన్‌లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

## : ఓయూ వీసీ కుమార్ మొలుగరం

**సైకాలజీ, ఎడ్యుకేషన్, కేర్ సర్వీసెస్, హెచ్ ఆర్ రంగాల్లో అవకాశాలు..**

**జపాన్ ప్రతినిధులతో ముఖాముఖి.. 100 మందికి పైగా విద్యార్థినుల హాజరు..**






సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం పిలుపునిచ్చారు. ఓయూ సైకాలజీ, ఎడ్యుకేషన్ విభాగాలు, కెరీర్ కన్సలట్జ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రొఫెసర్ జి. రామ్ రెడ్డి దూరవిద్య కేంద్రంలోని సెంటినరీ హాల్లో 'జపాన్ లో ఉపాధి మార్గాలు-సైకాలజీ, ఎడ్యుకేషన్ విభాగాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తోందన్నారు. ఓయూ విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా ప్రతిభను చాటగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉన్నత విద్య, అంతర్జాతీయ విద్యా సహకారం, కెరీర్ అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. జపాన్లో వృద్ధుల జనాభా పెరుగుతుండటం, నైపుణ్యం కలిగిన నిపుణుల కొరత నేపథ్యంలో భారతీయ విద్యార్థులకు పలు రంగాల్లో అవకాశాలు ఉన్నాయని ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా మానసిక ఆరోగ్య సహాయం, వృద్ధుల సంరక్షణ సేవలు, బోధన, శిక్షణ, మానవ వనరుల నిర్వహణ (హెచ్ఆర్) రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. జపాన్లో చదువుకోవడం, ఉద్యోగం పొందడం, అక్కడ కెరీర్ను నిర్మించుకోవడానికి అవసరమైన అర్హతలు, జపనీస్ భాషా నైపుణ్యాల గురించి కెరీర్ కన్సలట్జ్ ఫౌండర్, సీఈఓ రోహిత్ మేనేని వివరించారు. జపాన్ నుంచి వచ్చిన ప్లస్ పివోట్ కో. లిమిటెడ్ సీఈఓ నియోకి యమమోటో, హనా గ్లోబల్ ఎడ్యుటెక్ డైరెక్టర్ మివూ హాన్, సాహిబోబెరుటే కో. లిమిటెడ్ సీఈఓ యోషిరో కుబోట, ఎంజాయ్ కో. లిమిటెడ్ సీఈఓ తకమాస ఇవాట, డోన్ ప్రతినిధి హయాటో ఇటో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్డీ సీనియర్ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్, కెరీర్ కన్సలట్జ్ బిజినెస్ డైరెక్టర్ ఉదయ్ పాల్గొన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రవీంద్రనాథ్ మూర్తి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆరట్స్ అండ్ సోషల్ సైన్సెస్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. స్వాతి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, అనుబంధ కళాశాలలకు చెందిన 100 మందికి పైగా విద్యార్థినులు హాజరయ్యారు. జపాన్లో ఉద్యోగావకాశాలపై నిర్వహించిన ఈ ముఖాముఖి కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. ముగింపులో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు.



# మెడికవర్ ఆసుపత్రిలో 16 మంది మృతుల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి: ఆప్

**వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..**

**ఆసుపత్రి యాజమాన్యాన్ని వివరణ కోరిన ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ నాయకులు..**

సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) సికింద్రాబాద్ లోని మెడికవర్ ఆసుపత్రిలో సెప్టెంబర్ 21, 22 తేదీల్లో 16 మంది మరణించినట్లు అక్టోబర్ 4న వార్తలు వెలువడటంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, మరణాలకు గల కారణాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు హేమా సుదర్శన్ జిల్లోజు, పార్టీ కిసాన్ వింగ్ అధ్యక్షుడు నేరేటి ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు బాబూలాల్ పవర్, ఎస్.ఎన్. రెడ్డి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పుల్లయ్య తదితరులు ఆసుపత్రి యాజమాన్యాన్ని కలిసి వివరణ కోరేందుకు వెళ్లారు. సంబంధిత ప్రతినిధులు ఆసుపత్రి యాజమాన్యంతో మరుసటి రోజు సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి, బాధ్యులెవరైనా ఉంటే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

# ఉప్పల్ స్టేడియం రహదారి విస్తరణపై కమిషనర్ పరిశీలన

**సర్వే ఆఫ్ ఇండియా భూముల సేకరణపై సమీక్ష.. ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు..**

**120 అడుగుల రహదారి విస్తరణతో ట్రాఫిక్ రద్దీకి చెక్..**





సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు చేపట్టనున్న ఉప్పల్ స్టేడియం రహదారి విస్తరణ పనులపై మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండింగ్ సర్వేయర్ తో పాటు ఎంఎంసీ, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో కలిసి రహదారి విస్తరణకు సంబంధించిన భూసేకరణ, అడ్డంకుల తొలగింపు అంశాలను సమీక్షించారు. ఉప్పల్ స్టేడియం రహదారిని 120 అడుగుల (36 మీటర్ల) మేర విస్తరించేందుకు అవసరమైన సర్వే ఆఫ్ ఇండియా భూములను అధికారులు కమిషనర్ కు చూపించారు. ఈ విస్తరణ వల్ల సుమారు 0.78 ఎకరాల భూమి ప్రభావితమవుతుందని వివరించారు. భూసేకరణకు సంబంధించి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపు అంశాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. భూములపై ఉన్న కాంపౌండ్ వాల్స్ తో పాటు కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు సంబంధించిన షెడ్ల వివరాలను కూడా అధికారులు ఆయనకు వివరించారు. ఇదిలా ఉండగా, రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న ఎన్ఎస్ఎల్ భవనం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బ్యారికేడింగ్ షీట్లను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ), సిటీ ప్లానర్ (సీపీ) లను కమిషనర్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, భూసేకరణ, పరిహారం, అడ్డంకుల తొలగింపు ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. రహదారి విస్తరణ పూర్తయితే ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు వాహనదారులకు రాకపోకల్లో మరింత సౌలభ్యం కలుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించి, పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# 'ఇండియా-వెస్టిండీస్' మ్యాచ్‌కు ముత్తూట్ ఫిన్కార్ప్ స్పాన్సర్




హైదరాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) : ఈ నెల 14న హైదరాబాద్లో జరగనున్న 'ఇండియా-వెస్టిండీస్' టీ20 మ్యాచ్ నేపథ్యంలో భారత క్రికెట్ హోమ్ సీజన్కు ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ టైటిల్ స్పాన్సర్గా వ్యవహరిస్తోందని ఆ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ థామస్ జార్జ్ ముత్తూట్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఈఓ షాజీ వర్గీస్ తోకలసి ఆయన మాట్లాడుతూ బీసీసీఐతో కుదిరిన ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ పోటీలకు వర్తిస్తుందని తెలిపారు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా సంస్థకు స్వాగతం పలికారని తెలిపారు. భారత క్రికెట్ అభివృద్ధికి ఈ భాగస్వామ్యం దోహద పడుతుందని పేర్కొన్నారు.

# అన్నోజిగూడలో వైభవంగా నవచండీ హోమం!

**గాయత్రీ మాత అవతారంలో భక్తులకు అమ్మవారి దర్శనం**

**వేదమంత్రోచ్ఛారణల మధ్య గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమం**

**ప్రత్యేక హోమాల్లో పాల్గొన్న ఆరు జంటలు**

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**

**భక్తులకు అన్నదానం**

**ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన గాయత్రీ మాత ఆలయం**





ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 12: అన్నోజిగూడలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వేదమంత్రోచ్ఛారణలు, అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం 8వ డివిజన్ అన్నోజిగూడ గాయత్రీ మాత ఆలయంలో ప్రత్యేక హోమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సోమవారం రెండో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీ మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆలయంలో గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోకకళ్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, కుటుంబ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. హోమగుండంలో సమిధలు సమర్పిస్తూ భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. భక్తిగీతాలు, మంగళహారతులతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

**హోమంలో పాల్గొన్న ఆరు జంటలు**

ఈ పవిత్ర హోమ కార్యక్రమంలో ఘట్కేసర్ మాజీ రైతు సహకార సంఘం డైరెక్టర్ సత్తిరెడ్డి-తిరుమలత, పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి-శైలజ, బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి-స్వప్న, ఉమాశంకర్-సరిత, సత్తి శివారెడ్డి-లక్ష్మీ శ్రీదుర్గ, కల్వల నరేష్-స్నేహలత దంపతులు పాల్గొన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

**భక్తులకు అన్నదానం**

ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాల అనంతరం కొవ్వూరి అమరేందర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు భోజన వసతి కల్పించారు. అమ్మవారి దర్శనంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు సిద్ది రాములు గుప్తా, కార్తీక్ పంతులు, కౌశిక్ పంతులు, ఇతర ట్రస్టు బోర్డు సభ్యులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. గాయత్రీ మాత నామస్మరణతో అన్నోజిగూడలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది...

# రైలు భద్రతా నిబంధనల అమలులో నిర్లక్ష్యం వద్దు

**సిబ్బందికి నిరంతర కౌన్సెలింగ్ నిర్వహించాలి:**

**దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ..**

**ఆర్యూబీ, ఆర్‌ఓబీ పనులను వేగవంతం చేయాలి..**

**నీటి నిల్వ నివారణకు ప్రత్యేక చర్యలు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) రైళ్ల సురక్షిత ప్రయాణానికి నిర్దేశించిన భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. రైలు కార్యకలాపాల్లో పాల్గొనే సిబ్బందికి భద్రతా మార్గదర్శకాలపై నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. సోమవారం సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో జోన్ పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, పాయింట్స్మెన్, స్టేషన్ మాస్టర్లు, ట్రైన్ మేనేజర్లు, గేట్మెన్ తో పాటు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతా విధానాలను కచ్చితంగా అనుసరించాలని స్పష్టం చేశారు. సూపర్వైజర్ లు సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ, రైళ్ల రాకపోకలు సురక్షితంగా, సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ ల డీఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం రైల్వే పరిధిలో నిర్మాణంలో ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్యూబీలు), రోడ్ ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీలు) పనుల పురోగతిని జనరల్ మేనేజర్ సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా నిర్మాణంలో ఉన్న ఆర్యూబీల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజీ వ్యవస్థలు, నీటి బయటకు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భూసేకరణతో పాటు ఇతర సమస్యల కారణంగా పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలని జనరల్ మేనేజర్ స్పష్టం చేశారు.



# కుటుంబ భద్రతకు జీవిత బీమా ఎంతో కీలకం

**శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.6.30 లక్షల బీమా పరిహారం**

**చెక్కును అందజేసిన మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు**




చేవెళ్ల,అక్టోబర్ 12(మనం న్యూస్): వడదెబ్బతో మృతి చెందిన చేవెళ్ల మండలం జాలగూడెం గ్రామానికి చెందిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుడు అచ్చిన వెంకటయ్య కుటుంబానికి రూ.6,30,637 బీమా పరిహారం అందజేశారు. బీమా పరిహారానికి సంబంధించిన చెక్కును చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

ఈ సందర్భంగా.....మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...... అనుకోని విపత్కర పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో జీవిత బీమా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో బీమా ద్వారా అందే ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి కొంతవరకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ధర్మీయ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ హనుమంత్, సీనియర్ డీజీఎం నరేందర్, ఏజీఎం శ్రీనివాస్, బీడీఎం. హర్షవర్ధన్, సంస్థ సిబ్బంది రమేష్,, వెంకటేష్,సరిత,కుమార్,మాణిక్యం, డెవలప్మెంట్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు...

# తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక: ఓయూ వీసీ కుమార్

**ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు..**

**విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన వీసీ, ప్రిన్సిపాల్..**







సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ అన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, వాటిలో దైవత్వాన్ని దర్శించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని పేర్కొన్నారు. భావితరాలకు తెలంగాణ సంప్రదాయాలను పరిచయం చేస్తూ, వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. ఓయూ ఆరట్స్ కళాశాల, ఓయూ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆరట్స్ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం అధ్యక్షతన, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మాయాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు, ఉద్యోగులకు ఆయన బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు, ఉద్యోగినులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ పూల బతుకమ్మల చుట్టూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ సందడి చేశారు. వారి ఉత్సాహంలో వీసీ ప్రొఫెసర్ కుమార్, ఆయన సతీమణి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం కూడా భాగస్వాములై బతుకమ్మ ఆడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. స్వాతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సి.ఎస్. స్వాతి, తెలుగు శాఖ ప్రొఫెసర్ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆటపాటలతో వేడుకలకు మరింత కళను తీసుకొచ్చారు.

# మహిళల కోసం లైటింగ్ సౌకర్యం

**పండుగ వేళ మహిళలకు ఇబ్బందులు లేకుండా చర్యలు**



చేవెళ్ల, అక్టోబర్ 12(మనం న్యూస్):

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి పుష్కరిణి వద్ద మహిళలు రాత్రి వేళల్లో బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా లైటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయించారు. మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి చొరవ తీసుకుని ఈ ఏర్పాట్లు చేపట్టారు.

బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేళ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొంటున్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఖదీర్, మోహన్ రెడ్డి, దర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 29 వినతులు స్వీకరించిన ఎంఎంసీ కమిషనర్

**టౌన్ ప్లానింగ్ విభాగానికి 22 దరఖాస్తులు..**

**వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం..**



సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ప్రజల నుంచి 29 వినతులను స్వీకరించారు. వీటిలో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 22 దరఖాస్తులు అందగా, ఇంజినీరింగ్ విభాగానికి నాలుగు, పారిశుద్ధ్యం, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యూసీడీ), వెటర్నరీ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కార చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వినతుల పరిష్కారంలో అనవసర జాప్యాన్ని నివారించాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కీలక వేదికగా ఉపయోగపడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఫిర్యాదుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పౌర సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపడమే మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



# పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

**పద్మారావు గౌడ్**

**ప్రతి వార్డులో సహాయ కేంద్రాల ఏర్పాటు..**

**పాత ఓటర్లతో పాటు కొత్త పట్టభద్రుల పేర్ల నమోదుకు సూచన..**

సికింద్రాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి వార్డులో పార్టీ నాయకులు, స్థానిక సంఘాల సహకారంతో సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సీతాఫల్ మండిలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో నియోజకవర్గ పరిధిలో సుమారు 11 వేల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. గతంలో నమోదైన వారందరి పేర్లను తిరిగి నమోదు చేయించడంతో పాటు, 2023 నాటికి పట్టభద్రులైన కొత్త అర్హుల పేర్లను కూడా నమోదు చేయించాలని సూచించారు. సీతాఫల్ మండిలోని తన కార్యాలయంలో నిరంతరం పనిచేసే సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పద్మారావు గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, ఉద్యమకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు చురుగ్గా పాల్గొని నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ సామల హేమతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.